
# మాకూ హక్కులుంటాయి



పినిశెట్టి శ్రీనివాసరావు

"అదికాదు బాబాయ్... ఆయనేమిటి అలా మాట్లాడుతాడు? వాళ్ళ ఊళ్ళో నీళ్ళే తియ్యగా వుంటాయట. అక్కడికి మనమేదో చప్పటివి, ఉప్పటివి నీళ్ళు తాగుతున్నట్టు! ఆ నీళ్ళు తాగితేనే మంచి కలరొస్తుందట — మన ఊళ్ళో నీళ్ళు తాగితే క్రిమొద్దుల్లా తయారవుతారనా? వాళ్ళు పీల్చేదే స్వచ్ఛమైన గాలి, వాళ్ళు తినేదే పంచభక్ష్యపరమాన్నం, వాళ్ళ ఇల్లే ఒక ప్యాలెస్ — ఇంకా వాళ్ళ కుక్క, పనిమనిషి, గార్డెన్‌లో గడ్డి, గోంగూర — ఇవన్నీ గ్రేట్‌ట. సొంత డబ్బా కొట్టుకోడానికైనా ఓ హద్దుండాలి. నువ్వున్నావని కానీ బాబాయ్... లేకపోతేనా, ఇక చాలు గప్పాలు అని చురకంటించేవాడిని..."

"ఒరేయ్ నాసూ ... వాళ్ళు మగపెళ్ళివాళ్ళురా. ఆడపెళ్ళివాళ్ళం తొందరపడ కూడదు. నువ్వింకా చిన్నపిల్లాడివి... నా మాట విని మన లక్ష్మి పెళ్ళయ్యేంతవరకూ తొందరపడకు నాయనా!" బాబాయ్ నన్ను అర్థిస్తున్నట్టు నా చేతులు పట్టుకునేటప్పటికి, నా ఆవేశం చల్లారిపోయింది.

మగపెళ్ళివారు - ఆడపెళ్ళివారి కంటే ఏ రకంగా ఎక్కువ? ఏమిటి సాంప్రదాయం? ఏమిటి హెచ్చు తగ్గులు! ఈ పరిస్థితి మారేదెప్పుడు?

** ** **

మగపెళ్ళివారిని 'రిసీవ్' చేసుకోవడానికి బాబాయ్, నేనూ స్టేషన్‌కు వెళ్ళాం. మా సహనానికి అంతం చూశాక, మూడు గంటల లేటుతో వచ్చింది ట్రైను. మగపెళ్ళివారు ట్రైను దిగారు. ట్రాన్స్‌ఫరై వస్తున్నట్టుగా ఎంత సామాను! నలుగురు రైల్వే కూలీలున్నా, బాబాయ్, నేనూ చెరొక సూట్‌కేస్ పట్టుకోక తప్పింది కాదు.

ముందు రైల్వే కూలీలూ, వెనక బాబాయ్, నేనూ, మా వెనక పిఐపీల్లా చేతులూపుకుంటూ మగపెళ్ళివారూ!

మగపెళ్ళివారు ఎక్కిన కార్లను 'కెనాల్ గెస్ట్ హౌస్'కు పోనియ్యమని చెప్పి, బాబాయ్, నేనూ ఆటో ఎక్కాం. రైల్వే కూలీలు డబ్బులంటూ మా చుట్టుముట్టారు. బాబాయి ఇరవై నోటు తీసి వాళ్ళ చేతిలో పెట్టాడు. బాబాయ్, నేను కూడా మోశాం చెరొక సూట్‌కేసు! మా కెవరిస్తారు కూలీ?

అయినా వాళ్ళ సామానుకు మేం కూలీ ఇవ్వడమేమిటి? నాలో నేనే అనుకున్నాను. బాబాయ్‌ని అడగలేదు. అడిగితే బాబాయ్ చెప్పే సమాధానం అదే... "వాళ్ళు మగపెళ్ళివాళ్ళురా."

మగపెళ్ళివారు గెస్ట్‌హౌస్‌లోని గదుల్లోకి వెళ్ళిపోయారు. బాబాయ్, నేనూ బైట వరండాలో మంచున్నాం ఒబీడియంట్ సర్వెంటుల్లా.

"మనల్ని అసలు పట్టించుకోరేంటి బాబాయ్? మనతో మాట్లాడడం కానీ, లోపలకొచ్చి కూర్చోమని అనడంకానీ అనరేంటి?" నాలో సహనం చచ్చిపోతుంటే భరించలేక బాబాయ్‌తో అన్నాను.

నానుండి తప్పించుకోడానికన్నట్టు, బాబాయ్ లేచి పెళ్ళికొడుకు తండ్రి వున్న గదిలోకి వెళ్ళాడు. ఆయన ఆపసోపాలు పడుతూ మంచం మీద పడుకొని వుంటే బాబాయ్ ఆయన కాళ్ళ వైపు చేతులు కట్టుకుని అతి వినయంగా బంట్రోతులా నిలబడి వుండడం చూసి నా రక్తం మరిగిన మాట వాస్తవం.

ఇంతలో ఏమైందో బాబాయ్ హడావిడిగా బైటకొచ్చి, "ఒరే నాసూ! నువ్వు అర్జెంటుగా బజారుకెళ్ళి ఓ అరడజను టవల్స్, టాయ్‌లెట్ సోప్స్, షాంపూ సీసాలూ తీసుకురా" అంటూ ఓ వంద కాయితం నా చేతిలో పెట్టాడు.

"ఈ రోజు ఆదివారం బాబాయ్. షాపులు తెరవరు" అన్నాను.

"మరెలా? రూమ్స్‌లో టవల్స్, సోప్స్ పెట్టలేదని మగపెళ్ళివారు కంప్లైంట్ చేస్తున్నారు" అన్నాడు బాబాయ్ కంగారుపడిపోతూ.

"అదేంటి బాబాయ్! వాళ్ళు టవల్స్, సోప్స్ తెచ్చుకోలేదా?"

"నాసూ! ప్రశ్నలెయ్యకు. వాళ్ళు అడిగింది ఇవ్వడమే మన ధర్మం" అన్నాడు బాబాయ్ సీరియస్‌గా.

"ధర్మం! నువ్విలా 'యువర్స్ మోస్ట్ ఒబీడియంట్లీ' అంటూ చెప్పిందానికల్లా తలూపితే, వాళ్ళు మనల్ని పీల్చి పిప్పిచేస్తారు బాబాయ్" అన్నాను కోపం వుండబట్టలేక.

"నాసూ!..." అన్నాడు బాబాయ్ కోపంగా.

"సరిలే బాబాయ్ కోప్పడక. నువ్వు చెప్పినట్టే చేస్తాను. 'మా మగపెళ్ళివారొచ్చారు

15-2-91 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

— షాపులు తెరవండోహో" అంటూ దండోరా వేయిస్తాను.

నువ్వు చెప్పిన టవల్స్, సోప్స్‌తోపాటు హెయిరాయిల్ సీసాలు, దువ్వెనలు, బ్లేడ్లు, బనీన్లు, డ్రాయర్లు కూడా తెచ్చిపడేస్తాను బాబాయ్. అవి మాత్రం అడగరని గ్యారంటీ ఏమిటి? వాళ్ళు మగపెళ్ళివారు కదా! వాళ్ళు అడిగితే మన ఒంటి మీద బట్టలైనా విప్పిచ్చేయాలి" అన్నాను వ్యంగ్యంగా.

బాబాయ్‌కి కోపం వచ్చినా నవ్వేశాడు.

విధ్యలేక నేనూ నవ్వేశాను.

ఆడపెళ్ళివాళ్ళం కదా!

** ** **

పెళ్ళిలో అన్నిటికంటే వీడియోవాళ్ళ హడావిడే ఎక్కువగా వుంది. రెండు వీడియో కెమేరాలతో నలుగురు కుర్రాళ్ళు పెళ్ళి మండపం చుట్టూ చేరి పెళ్ళి జనానికి కనీసం వధూవరుల్ని కూడా కన్పడనీయకుండా కవర్ చేసేశారు.

మగపెళ్ళివారికి వీడియో పిచ్చి.

ఇకపోతే పెళ్ళి భోజనం బాగోలేదట. కాఫీ వేడిగా లేదు, మంచినీళ్ళు చల్లగా లేవు. స్వీటు తియ్యగా లేదు. హాటు ఘాటుగా లేదు. ఇక్కడ మంచినీళ్ళు తాగితే దాహం తీరదట. బేండ్‌వాళ్ళకు ఒక్క పాట సరిగ్గా వాయించడమే రాలేదట. మగపెళ్ళివారు — ఒక్కొక్కరూ ఒక్కో కామెంట్. వాళ్ళు ఎరేంజ్ చేసిన రిసెప్షన్ ఎంతో గ్రాండుగా వుంటుందట. వాళ్ళు మగపెళ్ళివారు కదా మరి!

తిరుగు ప్రయాణంలో పది మందికి ఒకే ట్రైనులో ఒకే రోజుకు రిజర్వేషన్ దొరకాలంటే మేరేజస్ సీజన్‌లో మాటలా?

"మీకు రైల్వేవాళ్ళు ఎవ్వరూ తెలీదా ఏమిటి! అదే మా ఊరైతే, వి.ఐ.పి. కోటాలో ఎన్ని టిక్కెట్లైనా ఇప్పించేవాళ్ళం - మీరేం లాభం లేదు" మగపెళ్ళివాళ్ళ మాటలివి.

విని ఊరుకున్నాం — వాళ్ళు మగపెళ్ళివారు కదా!

ఇక లక్ష్మిని అత్తవారింటికి పంపించే ఘట్టం వచ్చింది.

"స్టేషనుకు వచ్చేవాళ్ళు — ట్రైను దగ్గర ఏడ్పటాలు వగైరా చేయడం పెళ్ళికొడుక్కి నచ్చదట. అలాంటి వాళ్ళెవరైనా వుంటే స్టేషనుకు రావద్దన్నారు" మగపెళ్ళివారి తరపున ఒక మనిషి వచ్చి చెప్పారు.

తిట్టే పడొచ్చు — కొట్టినా పడొచ్చు. ఆత్మాభిమానం వదిలి చాకిరీ చెయ్యొచ్చు. పెల్లుబికి వచ్చే దుఃఖాన్ని ఆపడం ఎవరితరం? కని పెంచిన తల్లిదండ్రులు కన్నకూతుర్ని అత్తారింటికి పంపేటప్పుడు కంట తడిపెట్టొద్దని శాసించే అధికారం ఎవ్వరికైనా వుందా?

మగపెళ్ళివారంటే — సంస్కారం లేనివాళ్ళనీ, హృదయం లేనివాళ్ళనీ, పరాన్న భుక్కులనీ ఏ డిక్షనరీలోనైనా వుందేమో వెతికి చూడాలి.

బాబాయ్ ఎంత కంట్రోలు చేసుకున్నా, పిన్ని మాత్రం ట్రైను కదిలి కనుమరుగయ్యేంతవరకూ రోదిస్తూనే వుంది.

పిన్నిని ఓదార్చబోయి, బాబాయి చిన్నపిల్లాడిలా ఏడ్చేయడంతో నేనూ ఏడ్చేశాను.

మగపెళ్ళివాళ్ళలా, వీటన్నిటికీ నేను అతీతుడ్ని అంటూ ట్రైను మాత్రం గుండెలేనిదానిలా వెనక్కి తిరిగి చూడకుండానే మొండిగా ముందుకు సాగిపోయింది.

అయితే, మగపెళ్ళివాళ్ళు చెప్పిందల్లా చేసి, ఏ ఒక్క విషయంలోనూ వాళ్ళు గీసిన గీత దాటని బాబాయి, "ఏడ్చేవాళ్ళు ట్రైను దగ్గరకు రావద్దని" వాళ్ళు పెట్టిన కండిషన్‌ను మాత్రం అతిక్రమించి స్వతంత్రించి ఏడ్వగలిగినందుకు నాకు చాలా సంతోషమనిపించింది.

ఆడపెళ్ళివారికీ కొన్ని హక్కులుంటాయి మరి! ◆

---

తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# ఆంధ్రజ్యోతి
## సచిత్ర వారపత్రిక

## తెలుగు కళాసమితి, న్యూజెర్సీ

సంయుక్త ఆధ్వర్యంలో

ఉగాదికి

చిన్న కథలు-వ్యంగ్య చిత్రాల పోటీ

## 5,400 రూపాయిల బహుమతులు

క్రిందటి సంవత్సరం నిర్వహించినట్లుగానే ఈ ఏడాది కూడా అమెరికాలోని తెలుగు వారు ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక ద్వారా చిన్న కథ, కార్టూన్ విభాగాల్లో పోటీలు నిర్వహించతలపెట్టారు.

కథలు

ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన కథలకు వరుసగా రు. 1000, రు. 700, రు. 400 బహుమతులుగా వుంటాయి. ఇవి కాక ఒక్కో కథకు రు. 300 బహుమతి చొప్పున ఆరు కథలను రు. 150 బహుమతి చొప్పున ఆరు కథలను సాధారణ ప్రచురణకు ఎంపిక చేస్తాము.

### నిబంధనలు

తెలుగువారి జీవిత చిత్రణ లక్ష్యంగా మీరు పంపే కథలు అమెరికాలోని ఆంధ్రులకు అర్థమయ్యేలా సులభ శైలిలో, సరళమైన భాషలో వుండాలి.

* వ్రాతలో కథ మూడున్నర అర తావులు వుండాలి.

* అనువాద కథలు, అనుకరిస్తూ చేసిన రచనల స్వీకరించడం జరుగదు కనుక - రచయితలు తమ రచన(లు) అనువాదం, అనుసరణ కావని స్పష్టంగా పేర్కొంటూ హామీ పత్రాన్ని జతపరచాలి.

* ఒకరు ఎన్ని రచనలైనా పంపవచ్చు.

* కలం పేరు అచ్చులో వినియోగించేందుకు మాత్రమే పరిమితం. రచనతో పాటు పూర్తి చిరునామా విధిగా వుండాలి.

* ప్రచురణకు అంగీకరించని రచనలను తిప్పి పంపడం సాధ్యపడదు కనుక, స్టాంపులు అంటించిన కవర్లు జత చెయ్యనవసరం లేదు.

* బహుమతి రచనల గురించి, సాధారణ ప్రచురణల గురించి తుది నిర్ణయం సంపాదక వర్గానిదే.

* బహుమతి పొందిన కథలు, సాధారణ ప్రచురణకు ఎంచిన కథలు ముందుగా ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రికలో అచ్చయి, ఆ తరువాత న్యూజెర్సీ తెలుగు కళాసమితి వారి మాస పత్రిక 'తెలుగు జ్యోతి'లో నెలకొకటి చొప్పున ప్రచురితమౌతాయి. కార్టూన్ల ప్రచురణకు కూడా యిదే పద్ధతిని అనుసరిస్తాము.

* ఎంపికైన రచనలకూ, బహుమతి కథలకూ, బహుమతి పొందిన కార్టూన్లకూ పారితోషికం అందజేస్తున్నది న్యూజెర్సీ తెలుగు కళాసమితి.

### కార్టూన్ విభాగం

* 'కాప్షన్' లేని కార్టూన్లకు ప్రాధాన్యత వుంటుంది.

* ఒక్కో కార్టూన్‌కు రు. 75 బహుమతి చొప్పున ఈ పోటీలో మొత్తం 8 కార్టూన్లను ఎంపిక చేస్తాము.

**కథలు కార్టూన్లకు గడువు తేదీ ఫిబ్రవరి 28**

—ఎడిటర్

చిరునామా: తెలుగు కళాసమితి, న్యూజెర్సీ వారి కథల పోటీ

ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక, పోస్ట్ బాక్స్ నెం. 712, లబ్బీపేట, విజయవాడ-520 010.